ఏసు బోధనలు ఆచరణీయం

రామంతాపూర్ : శాంతినగర్‌లో నూతనంగా నిర్మించిన గ్యాస్పల్ చర్చిని ఉప్పల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసు బోధనలు మానవాళికి ఆచరణీయమైనవని, మనిషి సన్మార్గంలో నడిపించేలా బైబిల్ బోధిస్తుందన్నారు. పాస్టర్ రవికుమార్, రాజు, ప్రకాష్, భాస్కర్, ఐజాక్ డాయనీ, డేవిడ్‌అనిల్‌కుమార్, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను నిత్యం స్మరించుకోవాలి


మాట్లాడుతున్న అర్జున్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలని జెడ్పీ ఘట్‌కేసర్ పాఠశాల 1971–72 పదోతరగతి పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అర్జున్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య విలువలు బోధించిందని తెలిపారు. దాసు, రాందాసు, సత్యం, రాజేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, గణేష్‌గౌడ్, జగదీశ్, శ్రీరామ్, కృష్ణంరాజు, నిఖిల్, ఉపేందర్, విష్ణు, లలిత్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం !


ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మేడ్చల్‌రూరల్: మండలంలోని బండమాదారం గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నెలవుగా మారాయి. బండమాదారం నుంచి శ్రీరంగవరం గ్రామానికి వెళ్లేదారిలో రోడ్డుకు సమీపంలో పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి రక్షణకవచాలు లేకపోవడంతో అటుగా వెళ్లేవారు ప్రమాదాల భారినపడే అవకాశం ఉంది. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్యమిత్రుడికి చేయూత



ఘట్‌కేసర్: అనారోగ్యం పాలైన బాల్యమిత్రుడికి ఏదులాబాద్‌లో అతడి స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఏదులాబాద్ జెడ్పీ పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సంలో పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి పాకం యాదగిరి అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యాడు. బాల్యమిత్రుడి ఆర్థికపరిస్థితిని గమనించిన అతడి బాల్యస్నేహితులు ఆయన ఇంటికెళ్లి పరామర్శించి రూ. 57 వేలు అందజేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భూదేవిశ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ప్రతిమలను ఏర్పాటు చేసి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణమహోత్సవానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం

మేడ్చల్‌రూరల్: కుమారుడితో సహా తల్లి అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన మన్నె స్వప్న (26) తన పెద్ద కుమారుడు(6)తో కలిసి ఈనెల 18న పనికి వెళ్తున్నానని చెప్పి, ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, చుట్టుపక్కల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు.. పరుగు

డ్రైనేజీల పూడికతీత పనుల్లో జాప్యం
- నిత్యం అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మల్లాపూర్‌లోని వివిధ కాలనీల్లో పొంగుతున్న డ్రైనేజీలు

మల్లాపూర్: డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. మురుగు ప్రతిరోజు రోడ్లపై పారుతుండటంతో కాలనీవాసులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్లాపూర్ ఓల్డ్ విలేజ్, అశోక్‌నగర్, నెహ్రూనగర్, వెంకటరమణకాలనీ, బ్యాంక్ కాలనీ, గ్రీన్‌హిల్స్ కాలనీల్లో డ్రైనేజీ పొంగి యథేచ్ఛగా రోడ్లపై పారుతున్నా.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా..

బ్యాంక్ కాలనీ, నెహ్రూనగర్, ఓల్డ్ మల్లాపూర్, వెంకటరమణకాలనీలో నెలరోజులుగా మ్యాన్‌హోల్స్ నుంచి పొంగిపోర్లుతుందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

మట్టితీసి.. రోడ్లపై పారబోసి..

కిందస్థాయి సిబ్బంది పనిచేస్తున్నారో లేదో.. చూసుకోవాల్సిన అవసరం అధికారులకు లేదా..? అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. మ్యాన్‌హోల్స్ నుంచి మట్టిని తీసి రోడ్లపై పారబోసి వెళ్తున్నారు. మళ్లీ మట్టికుప్పలను తొలగించకపోవడంతో యథావిధిగా మట్టి మ్యాన్‌హోళ్లలోకి చేరుతోంది.

అనారోగ్యం పాలవుతున్నారు..

మురుగు అంతా రోడ్లపై ప్రవహించడంతో చుట్టుపక్కల నివాసం ఉండే వారు అనారోగ్యం పాలవుతున్నారు. అసలే ఎండాకాలం కావడంతో మురుగు రోడ్లపైకి చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం నడిచేందుకు వీలులేకుండా రోడ్డు పొడవునా మురుగు పారుతుండటంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నామమాత్రపు చర్యలు..

కాలనీలో నెలల తరబడి మురుగు రోడ్లపై పారుతుండటంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాటర్‌వర్క్స్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేస్తే తుతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రైనేజీ శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కనీసం పట్టించుకోవడం లేదు..



నెలరోజుల నుంచి మురుగు రోడ్డుపై ప్రవహిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగాయి. దీంతో కాలనీవాసులు రోగాల భారిన పడుతున్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలి.

– ఎండీ ఇస్మాయిల్, మల్లాపూర్

జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు లేవు..



పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ లేదు. చిన్న డ్రైనేజీ లైన్లు ఉండటంతో నిత్యం కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయి. డంపింగ్ యార్డును శుభ్రం చేసినా.. నీరు డ్రైనేజీలో కలపడంతో చిన్నలైన్లు కావడంతో పొంగుతున్నాయి.

– రాజేష్, మల్లాపూర్ కాలనీ ఐక్యవేదిక కన్వీనర్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


తిరుమల్‌నగర్ కాలనీవాసులతో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: తిరుమల్‌నగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం కాలనీలో పర్యటించిన ఆయనకు పలు సమస్యలను కాలనీవాసులు వివరించారు. రోడ్లు, విద్యుత్ వైర్లు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరారు. దీనిపై సానుకూలంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. త్వరలోనే అన్ని విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలతో పాటు, అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. కాలనీ అధ్యక్షుడు నర్సింగరావు, బాబూరావు, రంగయ్య, మాధవన్, పండరి, రాము, లక్ష్మి, మనోహర్, రత్నం తదితరులున్నారు.

ప్రశాంతంగా ప్రిలిమ్స్ పరీక్ష



రామంతాపూర్ : దేశవ్యాప్తంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ ప్రిలిమ్స్ పరీక్ష ఉప్పల్ సర్కిల్‌లోని 6 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిందని అధికారులు లెలిపారు. ఉప్పల్ సర్కిల్‌లో ఉప్పల్‌లోని కేంద్రియ విద్యాలయ-1, కేంద్రియ విద్యాలయం-2, రామంతాపూర్‌లోని అరోరా పీజీకళాశాల మెగా ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిస్టన్ డిగ్రీ పీజీ కళాశాల స్ఫూర్తి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 2688 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 1596 మంది హాజరయ్యారు. 1092 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేంద్రాల్లో నిర్వహించిన సివిల్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 6 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన పరీక్షలకు 2688 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. కేవలం 605 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, అదనపు డీసీపీ వెంకటరమణలు పర్యవేక్షించారు.

చాతుర్మాస దీక్ష అద్భుతం : స్వాత్మానందేంద్ర స్వామి



మల్కాజిగిరి: చాతుర్మాస దీక్ష చాలా అద్భుతమే కాకుండా విశేషమైందని, విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రసరస్వతీ స్వామి అన్నారు. ఆదివారం మల్కాజిగిరిలోని ఆనంద్‌బాగ్‌లో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, మల్కాజిగిరిశాఖ అధ్యక్షుడు దుర్గారాం నివాసానికి వచ్చిన ఆయనకు భక్తులు, శిష్యులు స్వాగతం పలికారు. అనంతరం స్వాత్మానందేంద్రస్వామి మాట్లాడుతూ.. స్వరూపానందసరస్వతీస్వామి రుషీకేష్ ప్రాంతంలోనే విద్యను అభ్యసించారని, అమ్మవారి అనుగ్రహంతో గంగాఒడ్డున 15 ఏళ్లుగా చాతుర్మాస దీక్ష చేస్తున్నారన్నారు. నగరంలో తొలిసారి మల్కాజిగిరిలో 2007లో దీక్ష చేశారని, తిరిగి ఈ ఏడాది నగరంలోనే దీక్ష చేస్తారని చెప్పారు. ఈ దీక్షలో భాగంగానే ఆ ప్రాంతాల్లో పర్యటిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలందరికీ రాజశ్యామలా అమ్మవారి అనుగ్రహం కలగాలని ఆకాంక్షించారు.

రోడ్డు తవ్వకం.. వివాదాస్పదం.!



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని బాకారంలో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు తవ్వకాల పనులు వివాదాస్పందంగా మారాయి. బాకారం పోచమ్మ ఆలయం చౌరస్తా నుంచి బాకారం మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులకు కొద్ది రోజుల క్రితం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శంకుస్థాపన చేశారు. ఈ పనులను జీహెచ్ఎంసీ అధికారులు శనివారం కాంట్రాక్టర్ ద్వారా పాత రోడ్డు పనులు చేపట్టారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజల ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి వీలుగా సగం రోడ్డు వేసి తర్వాత మిగిలిన రోడ్డు వేయాలని స్థానికులు కె.నర్సింగ్‌రావు పలువురు రోడ్డు తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ పనులు ఆపి ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ డీఈ గీత, ఏఈ వినోద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకు తెలిపారు. వారు అక్కడికి చేరుకుని రోడ్డు మొత్తం ఒకేసారి తవ్వి ఒకేసారి వేస్తామని.. సగం సగం వేయడం కుదరని స్థానికులతో చెప్పారు. అలా అయితే తమకు చాలా ఇబ్బంది అవుతుందని స్థానికులు తెలిపారు. దీంతో అధికారులు, స్థానికుల మధ్య వాగ్వాదం జరిగింది. స్థానికులు ఒప్పుకోకపోవడంతో అధికారులు రోడ్డు తవ్వకాలను నిలిపేసి వెళ్లిపోయారు. ఈ తర్వాత అధికారులు, స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని చర్చించి ప్రజలకు ఇబ్బందులు జరగకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

భూ భారతి దరఖాస్తుల పరిశీలన

తహసీల్దార్ అశోక్‌కుమార్

కీసర: మండల పరిధిలో భూభారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఈనెల 5 నుంచి 13 వరకు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూములు ఉన్న రైతుల నుంచి వచ్చిన వివిధ దరఖాస్తులను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టామని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 1082 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. మ్యూటేషన్‌కు సంబంధించి 81, రికార్డులో పేర్ల నమోదుకు 412, డీఎస్ పెండింగ్ 61, భూ విస్తీర్ణంలో తేడాలు సరిచేయాలని 77, భూ వివరణ, స్వభావం మార్పుకోసం 54, పట్టాదారు పేరు మార్పు కోసం 18, కొత్త పట్టాదారు పాస్‌బుక్ కోసం 103, ప్రభుత్వ భూములకు సంబంధించి 42, ఓఆర్సీ 3, విరాసత్‌కోసం 202, సాదాబైనామా 16, 38–ఈ సర్టిఫికెట్ల కోసం 3, భూ రికార్డుల్లో వ్యత్యాసాలను సరిచేయాలని 388 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి రెవెన్యూ రికార్డులతో పాటు, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు దరఖాస్తుదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేయడంతో పాటు, సంబంధిత దరఖాస్తుదారుడికి క్షేత్రస్థాయిపరిశీలనకు సమాచారం అందజేస్తూ.. దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు వివిధ గ్రామాల్లో అధికారుల బృందం 300 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారని, వీలైనంత త్వరగా దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్ మీటర్ల ఏర్పాటుపై హర్షం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్ వాంబే కాలనీలో కొంతకాలంగా ఏర్పడిన సమస్యకు తెరపడింది. సుమారు 80 కుటుంబాలకు విద్యుత్ మీటర్లు మంజూరు కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి కృషితోనే అభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. త్వరలోనే మరో 400 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు కానుందని మల్లిఖార్జున్ ఆశాభావం వ్యక్తం చేశారు. వేణుగౌడ్, చందు, శివ, సిద్దయ్య, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు



గౌతంనగర్: మాసశివరాత్రిని పురస్కరించుకుని గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఉత్తమ్‌నగర్ దుర్గా జ్యోతిష్యాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలు, గోత్రనామాలపై అర్చన, అభిషేకాలు, రుద్రోహం నిర్వహించినట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ ప్రకటించారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన గ్రామపాలన అధికారి పరీక్షాకేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి పరిశీలించారు. మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న గ్రామపాలన అధికారి పరీక్ష కేంద్రంలోని గదులను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందా.. అని, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

మేడ్చల్ జిల్లా సీపీఐ కార్యదర్శిగా ఉమామహేష్



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సీపీఐ కార్యదర్శిగా ఉమామహేష్ ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ఈసీఐఎల్‌లో జరిగిన మేడ్చల్ జిల్లా 4వ మహాసభల్లో కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన ఉమామహేష్‌ను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. గతంలో ఆయన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. మహాసభల్లో సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర, జిల్లా నాయకులు వీఎస్‌బోస్, యూసుఫ్ ,దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్‌ను సోమవారం అధికారికంగా ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి కోరారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెనోవా ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులోని వాకర్స్ ఆరోగ్య పరిరక్షణ కోసం తరచూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి పావనీశ్రీలత ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది.

– ఉప్పల్/రామంతాపూర్

కలుషిత నీటిసరఫరాతో ఇబ్బందులు


కానాజీగూడ గ్రీన్‌ఫీల్స్ కాలనీలో సరఫరా అయిన నీరు

అల్వాల్: అరకొర నీటి సరఫరాతోనే ఇబ్బందులు పడుతుంటే మరోవైపు కలుషిత నీటి సరఫరా కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానాజీగూడ గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీలో గత రెండు వారాలుగా తాగునీటి లీకేజీతో కాలనీలో నీటి సరఫరాకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. తాగునీటి సరఫరా మురికినీరుగా వస్తుంది. ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే కొంత కాలం అలాగే వస్తుందంటూ దాటవేస్తున్నారని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపం స్పష్టంగా ఉందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలుషిత తాగునీటి సరఫరాను అరికట్టాలని కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణమెప్పుడో ?

- ప్రశాంత్‌నగర్‌లో నిర్మించాలని విజ్ఞప్తులు
- ఖాళీ స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచన


ఖాళీ స్థలంలో నిరుపయోగంగా పడిఉన్న డ్రైనేజీ పైపులు

మౌలాలి : గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీహాల్ వెనుక స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. సరైన వసతి సౌకర్యాలు లేకపోవడంతో క్రీడాకారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, కాలనీవాసులు వాపోయారు.

పేరుకుపోయిన పిచ్చి మొక్కలు..

ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీహాల్ వెనుక ఖాళీ స్థలంలో చెత్త,చెదారం పేరుకుపోయి, పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా పడి ఉంది. దీంతో సమీపంలోని ఇళ్లలోకి పాములు, తేళ్లు వస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురౌతున్నారు. దీనిపై అనేకసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖాళీస్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

డంపింగ్ యార్డులా మార్చారు..



ప్రశాంత్‌నగర్ కమిటీహాల్ వెనుక ఉన్న స్థలంలో డ్రైనేజీ పైపులు ఉండటంతో చాలా ఇబ్బందిగా ఉంది. ఖాళీ స్థలాన్ని డంపింగ్‌యార్డుగా మార్చేశారు. దీనిపై అనేకసార్లు అధికారుల వద్దకు వెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

– పర్వతాలుయాదవ్, కాలనీ అధ్యక్షుడు

అధికారులు సమస్యను పట్టించుకోవాలి



ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీహాల్ వెనుక భాగాన చెత్త,చెదారం పిచ్చి మొక్కలతో నిండిపోవడం వల్ల పాములు చేరి కాలనీవాసులు భయభ్రాంతులకు గురౌతున్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– ప్రవీణ్, కాలనీ ప్రధాన కార్యదర్శి